సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 31 । మార్చి । 2023



బెట్టింగ్ భూతానికి బలి!

రూ. కోట్లకు పడగెత్తాలనే అత్యాశతో ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు పెడుతున్న యువత జీవితాలు నాశనమవుతున్నాయి.

- 8లో ▸



వరికి తెగులు..

వరి పంటకు తెగుళ్లు సోకుతున్నాయి. నివారణకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నా ఫలితం ఉండడంలేదు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.9 /25.4

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ శుక్ర: 6:34
సహర్ శని: 4:48

న్యూస్‌రీల్

4న మామిడి చెట్ల పంట వేలం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద ఉద్యాన క్షేత్రంలో 20 ఎకరాల్లో గల మామిడి చెట్ల పంటను ఏప్రిల్ 4న వేలం వేయనున్నట్లు ఉద్యానక్షేత్ర అధికారి రామకృష్ణ తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ. 1000 డిపాజిట సొమ్ము చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

నీటి కోసం ఆందోళన



రాజంపేట: మండల కేంద్రమైన రాజంపేట రెండో వార్డులో నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. గంటసేపు ఆందోళన చేపట్టడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో స్పందించిన సర్పంచ్ త్వరలో నీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆలయాల అభ్యున్నతికి ప్రభుత్వ కృషి



నిజాంసాగర్: దేవాలయాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అన్నారు. గురువారం మండలంలోని మహమ్మద్‌నగర్‌లోని హనుమాన్, రామాలయం వద్ద రూ. 30 లక్షలతో నూతనంగా నిర్మించిన ధర్మశాలను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని మతాల ఆలయాలకు నిధులు ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి, సర్పంచ్ దఫేదార్ బాలమణి నాయకులు దుర్గారెడ్డి, గైని విఠల్, నర్సింహారెడ్డి, వాజిద్ అలీ, లింగాల రాంచందర్, లక్ష్మీనారాయణ, సంగమేశ్వర్‌గౌడ్, జక్కానీ శ్రీనివాస్, దుబ్బ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో విద్యార్థులే కీలకం



నస్రుల్లాబాద్: సమాజ సేవలో విద్యార్థులే కీలక పాత్ర వహించాలని తెలంగాణ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం దుర్కి గ్రామంలో ఎస్‌ఆర్‌ఎన్‌కే విద్యార్థులు చేపడుతున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో పాల్గొని ఆయన శ్రమదానం చే శారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, సర్పంచ్ శ్యామల, ఎంపీటీ సీ కుమ్మరి నారాయణ, పీఏసీఎస్ చైర్మన్ దివి టి శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఆర్టీసీ

ఖలీల్‌వాడి : నేడు నిజామాబాద్ రీజియన్‌లో డయల్ యువర్ ఆర్టీసీ ప్రోగ్రాం శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎం ఉషాదేవి తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రయాణికులు ఆయా నంబర్లకు ఫోన్‌చేసి తమ సమస్యలను, సూచనలను తెలపాలన్నారు.

రీజినల్ మేనేజర్, నిజామాబాద్	9959226011
డిపో మేనేజర్, ఆర్మూర్	9959226019
డిపో మేనేజర్, బోధన్	9959226001
డిపో మేనేజర్, నిజామాబాద్-1	9959226016
డిపో మేనేజర్, నిజామాబాద్-2	9959226017
డిపో మేనేజర్, కామారెడ్డి	9959226018
డిపో మేనేజర్, బాన్సువాడ	9959226020



శోభాయాత్రలో రాముడి విగ్రహం

కామారెడ్డి జిల్లా కేంద్రంలో శోభాయాత్ర

కాషాయ‘పురం’..

- జిల్లా కేంద్రంలో ఘనంగా శోభాయాత్ర
- ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న యువత

కామారెడ్డి టౌన్ : శ్రీరామనవమిని వేడుకలను పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం శోభాయాత్రను నిర్వహించారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి, హిందువాహిని, శ్రీరామ సేన ఆధ్వర్యంలో గురువారం పెద్ద ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. సాయంత్రం పాట్టి శ్రీరాములు విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ సిరిసిల్ల రోడ్, స్టేషన్‌రోడ్, సుభాష్‌రోడ్, పాంచ్‌రస్తా, గోపాలస్వామి రోడ్, పెద్దబజార్, నిజాంసాగర్ చౌరస్తా కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. భారీ శ్రీరాముని విగ్రహంతో పాటు, శివుడు, గరుడపక్షి, ఛత్రపతి శివాజీ, సింహం విగ్రహాలతో ర్యాలీ చేపట్టారు. డప్పు, నాసిక్‌డోల్ చప్పుళ్ల, కళాకారుల బృందాలు, భక్తి పాటలు, డీజే సౌండ్, భారీ లైటింగ్‌లతో, నృత్యాలతో శోభాయాత్ర కొనసాగింది. పుర రోడ్లన్నీ కాషాయ జెండాలతో నిండిపోయాయి. రైల్వే స్టేషన్ ముందు రమణారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువతీ, యువతులు, ఆంజనేయ మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

అంతా రామమయం..

- ఊరూవాడా వేడుకగా శ్రీరామనవమి
- కమనీయం సీతారాముల కల్యాణం
- ఉప్పొంగిన భక్తి పారవశ్యం
- శోభాయాత్రల్లో వేలాదిగా పాల్గొన్న భక్తులు

సాక్షి, కామారెడ్డి: సత్యవాక్కు పరిపాలకుడైన శ్రీరాముని జన్మదినం శ్రీరామనవమి సందర్భంగా గురువారం సీతారాముల కల్యాణోత్సవాన్ని ఊరూవాడా వేడుకగా నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లా నలుమూలలా వేడుకలు ఘనంగా జరిగాయి. అంతటా సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు, శోభాయాత్రలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కామారెడ్డి పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో ఆరు దశాబ్దాలుగా వేడుకలు నిర్వహిస్తున్నారు. గురువారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే పట్టణంలోని రామాలయంలో, వివిధ కాలనీల్లోని హనుమాన్ ఆలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి.



గౌరారం గ్రామంలో సీతారాముల కల్యాణోత్సవం

గాంధారి మండలం గౌరరంలోని శ్రీరామాంజనేయ ఆలయంలో కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగాయి. ఎల్లారెడ్డి పట్టణంలోని రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాగిరెడ్డిపేటలో సీతారాముల విగ్రహాలను పల్లకీలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అనంతరం కల్యాణోత్సవం జరిగింది. లింగంపేట రామాలయంలోనూ వేడుకలు ఘనంగా జరిగాయి. బాన్సువాడ పట్టణంతో పాటు తిర్మలాపూర్‌లలో రామాలయాల్లో వేడుకలు నిర్వహించారు. తాడ్వాయిలోని శబరిమాత ఆశ్రమంలో వేడుకలు నిర్వహించారు. దోమకొండ మండల కేంద్రంలోని శివరాం మందిర్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. మాచారెడ్డి మండలంలోని శాంతానంద తపోవనాశ్రమంతో పాటు ఆయా గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. బీర్కూర్‌లోని కోదండరామాలయంలో వేడుకలు నిర్వహించారు. జిల్లాలోని ఆయా మండలాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు, శోభాయాత్రలు జరిగాయి.

వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, నేతలు

బాన్సువాడ పట్టణంతో పాటు తిర్మలాపూర్, పోచారం గ్రామాల్లో జరిగిన వేడుకల్లో అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. కామారెడ్డి పట్టణంలోని రాంమందిర్‌లో నిర్వహించిన కల్యాణోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పాల్గొన్నారు. అలాగే దేవునిపల్లిలోనూ ఆయన పాల్గొన్నారు. మాచారెడ్డి మండలంలో జరిగిన వేడుకలకు హాజరయ్యారు. పట్టణంలోని ఆయా ఆలయాల్లో నిర్వహించిన కల్యాణోత్సవాల్లో మాజీ మంత్రి షబ్బీర్‌అలీ పాల్గొని పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి పలు ఆలయాల్లో నిర్వహించిన కల్యాణ ఉత్సవాలకు హాజరయ్యారు. జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుందలో సీతారాముల కల్యాణ వేడుకలకు జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే హాజరై పట్టు వస్త్రాలు సమర్పించారు. నిజాంసాగర్ మండలం మహమ్మద్‌నగర్‌లో జరిగిన వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ దంపతులు పాల్గొన్నారు. రామారెడ్డిలో కల్యాణోత్సవంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు. సదాశివనగర్‌లో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి హాజరయ్యారు.



బాన్సువాడ రామాలయంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న స్పీకర్ పోచారం దంపతులు

పరిహారం దక్కేనా!

- అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- ఎకరానికి 10వేల చొప్పున అందిస్తామని ప్రభుత్వ ప్రకటన
- 33 శాతం నిబంధనపై రైతుల ఆందోళన
- బాధితులందరికీ పరిహారం ఇవ్వాలని రైతుల వేడుకోలు

రాజంపేట: జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న, జొన్న, గోధుమ, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. జిలా వ్యాప్తంగా 981 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు సీఎం కేసీఆర్ ఇటీవల అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10వేల పరిహారం ప్రకటించడంతో జిల్లాలో వ్యవసాయాధికారులు సన్నాహం చేస్తున్నారు. నాగిరెడ్డిపేట, రాజంపేట, తాడ్వాయి, గాంధారి, లింగంపేట, దోమకొండ, భిక్కనూరు తదితర మండలాల్లో పంటనష్టం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయా మండలాల్లో పంట నష్టం వివరాలను అధికారులు నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే పరిహారం విషయంలో ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధన రైతుల ఆందోళనకు గురిచేస్తోంది.

33 శాతం దెబ్బతింటేనే..

పరిహారం విషయంలో ప్రభుత్వం నిబంధన విధించింది. పంట శాతం 33శాతం దెబ్బతింటేనా పరిహారం అందనుందని ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో నిబంధన మేరకు దెబ్బతిన్న పంటల వివరాలు సేకరిస్తున్నారు. దీంతో నిర్దేశిత(33 శాతం) మార్కుదాటని పంట నష్టపోయిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నిబంధన తొలగించి పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించాలని కోరుతున్నారు.



బస్వన్నపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

కౌలు రైతులకు కూడా..

పంట నష్టపోయిన కౌలు రైతులకు సైతం అందిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందు కోసం సర్వేలో కౌలు రైతులకు సంబంధించిన కాలమ్‌ను ఏర్పాటు చేశారు. కౌలు గుర్తింపు కార్డులు కలిగిన రైతులు వివరాల వ్యవసాయ విస్తరణాధికారులు నమోదు చేస్తున్నారు. దీంతో కౌలు రైతుకు సైతం పరిహారం అందనుంది.

పరిహారం త్వరగా అందాలి



నీటి వసతి ఉండడంతో ఈసారి ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నా. ఇటీవల కురిసిన అకాల వర్షానికి పంట మొత్తం నేల వాలింది. అధికారులు సరైనా సర్వే చేపట్టి పంట నష్టం అంచనా వేసి పరిహారం త్వరగా అందేలా చూడాలని కోరుతున్నాం.

– మహేందర్‌రెడ్డి, రైతు, బస్వన్నపల్లి

నిబంధనల ప్రకారమే..



ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవసాయ విస్తరణాధికారుల ద్వారా సర్వే ప్రారంభించాం. ప్రభుత్వం విధించిన నిబంధన 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టం కలిగిన రైతుల వివరాలను సేకరించి రెండు రోజుల్లో ప్రభుత్వానికి నివేదికలు అందించి రైతులకు పరిహారం అందేలా చూస్తాం.

– భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

అవును.. ఇది క్రీడా ప్రాంగణమే!



తాడ్వాయి మండలంలోని చందాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. ప్రాంగణం అన్న బోర్డు ఏర్పాటు చేశారు. గ్రౌండ్‌లో రాళ్లు, రప్పలతో కూడిన భూమిపై కనీసం మొరం గానీ, మట్టిగాని చల్లకపోవడంతో రాళ్ల మీద ఆటలు ఎలా ఆడతారో అధికారులకే తెలియాలి !

– సాక్షి, కామారెడ్డి

వారే ‘కీ’లకం..!

- ప్రధాన శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులదే హవా
- డిజిటల్ కీలూ వారి వద్దే..
- అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు
- డమ్మీలుగా మారిన రెగ్యులర్ ఉద్యోగులు

జిల్లాలో కొన్ని శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులే కీలకంగా మారారు. డిజిటల్ వ్యవహారాలకు సంబంధించిన ‘కీ’లక బాధ్యతలు వారి చేతుల్లోనే ఉండడంతో అంతా తామే అన్నట్లుగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. వారు రెగ్యులర్ ఉద్యోగులు, అధికారుల మాటలను సైతం ఖాతరు చేయడం లేదని తెలుస్తోంది.

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపల్, వైద్య ఆరోగ్యం తదితర శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆధిపత్యం నడుస్తోంది. కలెక్టరేట్‌లోని వివిధ శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చెప్పిందే వేదం అన్నట్లుగా తయారైంది. ఔట్ సోర్సింగ్ పద్ధతిన నియమితులైన ఉద్యోగులు మండల, జిల్లా స్థాయి అధికారుల మాటలను కూడా వినడం లేదని తెలుస్తోంది. జిల్లాలో తహసీల్ కార్యాలయం నుంచి మొదలుకొంటే కలెక్టరేట్ వరకు ధరణికి సంబంధించిన ఆపరేటర్లుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులే ఉన్నారు. ముఖ్యంగా భూ రికార్డులకు సంబంధించిన వ్యవహారాలన్నీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల చేతుల్లోనే ఉన్నాయి. దీంతో కొన్ని చోట్ల ధరణి ఆపరేటర్లు, ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. గతంలో కలెక్టరేట్‌లో పనిచేసిన ఓ ఉద్యోగిపై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. భారీ ఎత్తున డబ్బులు దండుకుని భూ రికార్డుల్లో అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో కలెక్టర్ సదరు ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు.

అంతా వాళ్ల చేతుల్లోనే..

జిల్లాలో దాదాపు అన్ని శాఖల కార్యకలాపాలు డిజిటల్ పద్ధతిలోనే జరుగుతున్నాయి. వాటికి సంబంధించిన డిజిటల్ ‘కీ’ని ఆపరేటర్లుగా పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల చేతికి ఇచ్చారు. దీంతో కొందరు ఆపరేటర్లు, ఉద్యోగులు ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మలచుకుని అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. మున్సిపల్, రిజిస్ట్రేషన్ శాఖల్లో కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రికార్డులనూ తారుమారు చేస్తున్నట్లు తెలుస్తోంది. వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల వినియోగానికి సంబంధించిన వ్యవహారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చేతుల్లో కొనసాగడంతో గతంలో వివాదాలు తలెత్తాయి. నిధుల విషయంలో అధికారికి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి మధ్య తలెత్తిన గొడవతో శాఖలో ఉద్యోగులు రెండుగా చీలిపోయారు. ఇలా ప్రతి శాఖలోనూ ఔట్ సోర్సింగ్ ఆధిపత్యం కొనసాగుతోంది.

అవకాశం దొరికినప్పుడల్లా..

కొన్ని ప్రభుత్వ శాఖల్లో రెగ్యులర్ ఉద్యోగులు డమ్మీలుగా మారాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. గతంలో కలెక్టరేట్‌లో ధరణిలో పనిచేసిన ఓ ఉద్యోగి తహసీల్దార్లతో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో, తహసీల్దార్లు కలెక్టర్‌ను కలిసి మొరపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా ఏ శాఖలో అయినా రెగ్యులర్ ఉద్యోగులైనా తప్పు చేస్తే మెమో వస్తుందనో, ఉద్యోగం ఊడుతుందోనన్న భయం ఉంటుంది. అదే ఔట్ సోర్సింగ్ పద్ధతిన బాధ్యతలు నిర్వహించే ఉద్యోగికి ఉద్యోగం ఎన్నాళ్లు ఉంటుందో తెలియదు. అలాంటి పరిస్థితుల్లో కొందరు అవకాశం దొరికినపుడల్లా నాలుగు డబ్బులు దండుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే ఆయా శాఖల్లో రెగ్యులర్ ఉద్యోగులకు కంప్యూటర్‌కు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇప్పిస్తే అన్ని పనులు వారే చేసుకునే అవకాశం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

సుభాష్‌నగర్: నిరుద్యోగ యువతీ యువకులకు టాటాస్ట్రైవ్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని సెంటర్ ఇన్‌చార్జి ఎండీ పాష ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్, బీపీఓ, రిటైల్, నర్సింగ్ కోర్సుల్లో శిక్షణనిస్తామన్నారు. ఉచిత హాస్టల్ వసతి ఉంటుందని, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులై, డిగ్రీ వరకు చదువుకున్న వారు అర్హులని, 18 నుంచి 27 ఏళ్లలోపు యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8328368554, 8074306410 నంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

రేపు సైకిల్ ర్యాలీ

ఖలీల్‌వాడి: ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శనివారం సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లా సైక్లింగ్ సంఘం సహకారంతో ఏప్రిల్ 1న ఉదయం 7 గంటలకు జిల్లా కోర్టులో సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు

గాంధారి(ఎల్లారెడ్డి): మద్యం సేవించి వాహనం నడిపిన ఒకరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో కామారెడ్డికి చెందిన ఎండీ షఫీ మద్యం సేవించి వాహనం నడిపినట్లు గుర్తించామన్నారు. ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

గుండెపోటుతో ఒకరి మృతి


పిట్ల స్వామి(ఫైల్)

రాజంపేట: రాజంపేటకు చెందిన ఒకరు గుండెపోటుతో మృతి చెందారు. గ్రామానికి చెందిన పిట్ల స్వామి(36) కుటుంబ సభ్యులతో కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కొత్తపల్లి శివారులో చిరుత సంచారం!



రుద్రూర్: కోటగిరి మండలం కొత్తపల్లి శివారులో చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గుట్ట ప్రాంతంలో మేత కోసం వెళ్లిన మందపై చిరుత దాడి చేయగా గురువారం సాయంత్రం ఒక మేక మృతి చెందింది.

రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో బుధవారం రాత్రి దొంగలు రెండు 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్లను ఎత్తుకెళ్లారు. రైతులు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించగ ఘటన స్థలాన్ని ఆర్మూర్ ఏడీఈ శ్రీధర్, ఏఈ మనీషా, లైన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ పరిశీలించారు.

ఘనంగా రాములోరి కల్యాణం


కామారెడ్డిలో తాళిబొట్టు చూపుతూ..


రామారెడ్డిలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు


శోభాయాత్రలో శివుడి విగ్రహం

జిల్లాలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. పట్టణాలు, పల్లెల్లోని రామాలయాలు, హనుమాన్ ఆలయాల్లో రాములోరి కల్యాణం జరిపించారు. సకల గుణ వల్లభుడికి సీతాదేవిని ఇచ్చి పండితులు వివాహం చేశారు. జగదభిరాముడి కల్యాణం తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. కామారెడ్డిలో శోభాయాత్ర నిర్వహించారు.


దేవునిపల్లిలో హాజరైన విప్ గంప గోవర్ధన్


సలాబత్‌పూర్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే


రామారెడ్డిలో పాల్గొన్న ఎమ్మెల్యే సురేందర్


మహమ్మద్‌నగర్‌లో జెడ్పీచైర్‌పర్సన్ శోభ దంపతులు


కామారెడ్డి శోభాయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకుడు వెంకటరమణారెడ్డి, హనుమాన్ స్వాములు


శోభాయాత్రపై పూలవర్షం

బెట్టింగ్ భూతానికి బలి!

- ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసవుతున్న యువత
- అంధకారమవుతున్న జీవితాలు
- అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకుంటున్న వైనం
- రోడ్డున పడుతున్న కుటుంబాలు



నందిపేట్: కోట్లకు పడగెత్తాలనే అత్యాశతో ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడుతున్న యువకుల జీవితాలు అంధకారమవుతున్నాయి. బంధువులు, స్నేహితుల వద్ద చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొందరు పరారవుతున్నారు. దీంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇలాంటి సంఘటనలు నందిపేట, డొంకేశ్వర్ మండలాల్లో వెలుగు చూస్తున్నాయి.

పరారీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు

భావితరానికి సన్మార్గం చూపాల్సిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు అత్యాశకు పోయి ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడి రూ. 3 కోట్ల బాకీలు చేసి పరారయ్యాడు. నందిపేటకు చెందిన ఓ ఉపాధ్యాయుడు కామారెడ్డి జిల్లా సదాశివనగర్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను వడ్డీ వ్యాపారం సైతం చేసేవాడు. బెట్టింగులకు అలవాటు పడి మోసానికి గురవుతు వచ్చాడు. ముందుగా తన తండ్రి నుండి రూ. 70 లక్షలు తీసుకుని వ్యాపారం చేస్తానని నమ్మించాడు. తర్వాత తన తండ్రి సోదరులైన ఇద్దరి నుంచి రూ.55 లక్షలు తీసుకున్నాడు. అంతే కాకుండా తోటి ఉపాధ్యాయుల వద్ద, స్నేహితుల వద్ద లక్షల రూపాయలు బాకీ చేశాడు. సహ ఉపాధ్యాయురాలైన ఓ మహిళా రూ. 15 లక్షలతో పాటు ఇంటి కాగితాలు ఇచ్చినట్లు సమచారం. అందరి దగ్గర సుమారు రూ. 3 కోట్ల పై చిలుకు బాకీ తీసుకుని బెట్టింగులో పోగొట్టుకుని ఏమి చేయాలో తెలియక పరారయ్యాడు.

మరో యువకుడి ఆత్మహత్య

ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడి రూ. 2 కోట్ల పైచిలుకు బాకీలు చేసి నందిపేటకు చెందిన ఓ యువకుడు అప్పులు తీర్చలేక ఆరునెలల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అలాగే నందిపేటలోని రాజనగర్ కాలనీకి చెందిన మరో యువకుడు రూ.2 కోట్ల అప్పు చేశాడు బకాయిలు తీర్చమని బాకీలు ఇచ్చిన వారు వెంటపడడంతో పరారయ్యాడు. పరారీలో ఉన్న అతనిని పట్టుకు వచ్చిన తండ్రి తనకు ఉన్న పొలాలను, ప్లాట్లను అమ్మి అప్పులు తీర్చాడు.

బర్త్‌డే అని చెప్పి..

డొంకేశ్వర్ మండలంలోని గంగసముందర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగులో రూ. 70 లక్షల పైచిలుకు పోగొట్టుకున్నాడు. అంతే కాకుండా హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదువుతున్న తన బంధువుల అమ్మాయిల దగ్గర నుంచి తన బర్త్‌డే అని బంగారు గొలుసులు తీసుకొని అమ్ముకున్నట్లు సమాచారం.

తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు

ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడుతూ మోసాలు గురవుతున్న యువకుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. యువకులు చేసిన పాపాలకు తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. తన పిల్లలు చేసిన బాకీలు తీర్చే పరిస్థితి లేక తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి నెలకొంది. పైసా పైసా పోగు చేసి డబ్బులు పెరుగుతాయనే ఆశతో అప్పులు ఇచ్చిన వారు సైతం తిరిగి రాక ఇబ్బందులు పడుతున్నారు.

అత్యాశతో బెట్టింగులు



అత్యాశతో యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. కరోనా కాలంలో లాక్‌డౌన్ సమయంలో విద్యార్థులు ఆన్‌లైన్ తరగతుల కోసం స్మార్టుఫోన్లకు అలవాటు పడిపోయారు. ఫోన్లలో వచ్చిన కొత్త కొత్త ఆప్‌లకు అలవాటుపడి బెట్టింగులకు పాల్పడి మోసాలకు పాల్పడుతున్నారు. తల్లిదండ్రులు సైతం పట్టించుకోవడం లేదు. ఆన్‌లైన్ ఆప్‌ల ద్వారా మోసపోకుండా పోలీసుల కళాబృందం వారి అవగాహన కల్పిస్తున్నాం. మోసపోయివారు ఎవరైన పిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– శ్రీకాంత్, నందిపేట ఎస్సై

రెండు లక్షల బియ్యం గింజలపై 'శ్రీరామ్'


బియ్యం గింజలను సమర్పిస్తున్న బిల్ల బాబు


బియ్యం గింజలపై ఉన్న రామనామం

నిజామాబాద్ సిటీ: నగరంలోని ముబారక్‌నగర్‌కు చెందిన బిల్ల బాబు శ్రీరామనవమి సందర్భంగా 2,01,400 బియ్యం గింజలపై శ్రీరామ్ అని రాసి హైదరాబాదులోని కూకట్‌పల్లి రామాలయంలో గురువారం అందజేశారు. ప్రతి ఏడాది ఎంతో శ్రద్ధ, ఓపికతో బియ్యం గింజలపై శ్రీరామ్ అని రాస్తూ శ్రీరామనవమి సందర్భంగా వివిధ ఆలయాలకు తలంబ్రాల రూపంలో బిల్ల బాబు అందజేస్తూ వస్తున్నారు. బియ్యం గింజలపై జైశ్రీరామ్ అని రాసి రాములవారికి తలంబ్రాలుగా సమర్పించడం తనకు ఎంతో సంతృప్తి ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. 2018లో 1,61,000 బియ్యం గింజలపై శ్రీరాం అని రాసి నిజామాబాద్‌లోని రఘునాథ ఆలయంలో అందజేశారు. అలాగే 2019లో 1,56,000 బియ్యం గింజలపై శ్రీరాం అని సుభాష్ నగర్ రామాలయంలో అందజేశారు. 2021లో 3,01,100 బియ్యం గింజలపై శ్రీరాం అని రాసి భద్రాచలం రామాలయంలో అందజేశారు. గతేడాది డిచ్‌పల్లి రామాలయంలో 1,61,000 బియ్యం గింజలపై శ్రీరాం అని రాసి అందజేశారు.

తలంబ్రాలకు భక్తుల స్పందన భేష్



డిచ్‌పల్లి : భక్తుల కొంగుబంగారం భద్రాద్రి సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలను ఇంటివద్దకే అందించేందుకు టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ (కార్గో) ద్వారా ప్రారంభించిన సేవలకు భక్తుల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభిస్తుందని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంపై ఆర్టీసీ గురువారం తలంబ్రాల బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. స్వామి వారి కల్యాణ వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఈ కౌంటర్ వద్దకు వచ్చి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేవలం రూ.116 చెల్లిస్తే భద్రాద్రి సీతారామచంద్రస్వామి వారి కల్యాణ తలంబ్రాలు మీ ఇంటి వద్దే అందుకునే అవకాశం ఆర్టీసీ కల్పించిందన్నారు. కల్యాణ తలంబ్రాలు బుక్ చేసుకున్న భక్తులకు రసీదులు అందజేశారు. 150 మంది భక్తులు రూ.116 చొప్పున మొత్తం రూ.17,400 చెల్లించినట్లు కార్గో ఇన్‌చార్జి మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్లు చందర్, దాసు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్‌లు అభివృద్ధి చెందుతున్నాయ్


వంతెనకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక నీటి ప్రాజెక్టులు అభివృద్ధి చెందుతున్నాయని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మెండోరా మండలం పోచంపాడ్‌లో పోచంపాడ్, సోన్‌పేట్ గ్రామాల మధ్య నూతన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక అభివృద్ధికి నిదర్శనం శ్రీరాంసాగర్ ప్రాజెక్టేనన్నారు. కాకతీయ కాలువ వంతెనపై దేశంలో ఎక్కడాలేని విధంగా కొత్త టెక్నాలజీతో వంతెన నిర్మిస్తున్నామన్నారు. రూ. 1.35 కోట్ల నిధులను సీఎం కేసీఆర్ స్వయంగా మంజూరు చేశారన్నారు. వంతెన నిర్మాణాన్ని మూడు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. కాకతీయ కాలువపై వంతెన నిర్మాణానికి కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బురుకుల సుకన్య, జెడ్పీటీసీ తలారి గంగాధర్, సర్పంచ్‌లు మిస్బా, ప్రకాశ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణ, ఎంపీటీసీ సభ్యుడు జాన్‌బాబు, కోఆప్షన్ సభ్యుడు బాబా, ప్రాజెక్ట్ ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గంగరమంధలో చిరుత పిల్లల కలకలం

మాక్లూర్ : మండలంలోని గంగరమంధ గ్రామ శివారు వ్యవసాయ పొలాల్లో గురువారం ఉదయం ఓ రైతుకు చిరుత పిల్ల కనిపించడంతో గ్రామంలో భయాందోళనలు చెలరేగాయి. రైతు రాజేశ్ తన పొలంలో గడ్డి కోస్తుండగా కొద్దిదూరంలో నుంచి చిరుత పిల్ల పరిగెత్తగా గమనించి వీడియో తీసి గ్రామస్తులకు తెలియజేశారు. సర్పంచ్ వెంటనే ఈ విషయాన్ని ఫారెస్ట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి అశోక్‌కుమార్, బీట్ అధికారి శ్రీనివాస్ గంగరమంద గ్రామానికి చేరుకోని రైతులతో కలిసి మూడుగంటలకు పైగా అన్వేషించగా చిరుత పులి, పిల్లల ఆనవాళ్లు లభించలేదు. గండు పిల్లి కూడా దూరం నుంచి చూస్తే చిరుత మాదిరిగానే కన్పిస్తుందని ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారులు పేర్కొన్నారు. ఏడాదికాలంగా చిరుత పిల్లలు ఈ ప్రాంతంలో తిరుగుతున్నాయని గ్రామస్తులు పేర్కొనడంలో వాస్తవం కనిపించడం లేదన్నారు. చిరుత ఉండి ఉంటే పశువులు, మేకలు, కుక్కలపై దాడి చేసేదన్నారు. ఏదేమైనప్పటికీ రైతులు, పశువుల కాపర్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రసాద్, భూమయ్య మరి కొందరు రైతులు ఫారెస్ట్ అధికారుల వెంట ఉన్నారు.

అధ్యాపకులు రిపోర్ట్ చేయాలి

నిజామాబాద్‌అర్బన్ : ఇంటర్ మూల్యాంకన కేంద్రంలో విధులు నిర్వర్తించే అధ్యాపకులు రిపోర్టు చేయాలని ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్న మొదటి స్పెల్ ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకన విధుల ఆర్డర్ కాపీలు వచ్చిన ఉమ్మడి జిల్లాలోని ప్రతి అధ్యాపకుడు వెంటనే రిపోర్ట్ చేయాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, గణిత శాస్త్రం, పౌరశాస్త్రంకు సంబంధించిన మూల్యాంకనానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మూల్యాంకన విధులకు హాజరుకాని అధ్యాపకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి మృత్యువాత

మాచారెడ్డి: చేపల వేటకు వెళ్లి ఫిట్స్ రావడంతో నీట మునిగి ఒకరు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన గురువారం మండలంలోని ఎల్లంపేటలో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లపు మల్లయ్య(30) గ్రామ శివారులోని మైసమ్మ చెరువుకు మరో వ్యక్తితో కలిసి చేపల వేటకు వెళ్లాడు. చెరువులోకి దిగగానే మల్లయ్యకు ఫిట్స్ వచ్చి నీట మునిగాడు. మరో వ్యక్తి కాపాడే యత్నం చేసినప్పటికి ఫలితం లేకుండా పోయింది. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కరెంట్ షాక్‌తో ఒకరి మృతి


పయ్యావుల స్వామి(ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): విద్యుత్ షాక్‌తో మండల కేంద్రానికి చెందిన పయ్యావుల స్వామి(44) గురువారం మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మరో రైతుకు చెందిన వ్యవసాయ బోరు మోటారు చెడిపోవడంతో మరమ్మతు చేయించి గురువారం ఉదయం చుట్టుపక్కల రైతులు కలిసి మోటారును దించారు. అనంతరం మోటారును స్టార్ట్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు స్వామి విద్యుత్తు షాక్‌కు గురై కింద పడిపోయాడు. తోటి రైతులు వెంటనే మండల కేంద్రానికి తరలించి ఓ ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో చేర్పించారు. పరిశీలించిన వైద్యుడు కామారెడ్డికి తరలించాలని సూచించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలించగా అక్కడ మృతి చెందాడు. మృతుడి కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా మహిళ..

ఖలీల్‌వాడి: ఇందల్వాయి మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ వద్ద గల ఎల్ సీ గేటు వద్ద గుర్తు తెలియని మహిళ అనుమానాస్పదంగా మృతి చెందినట్లు రైల్వే ఎస్సై ప్రణయ్ గురువారం తెలిపారు. ఆమెకు 40 ఏళ్ల ఉంటాయని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిస్తే రైల్వే పోలీసులను ఆశ్రయించాలన్నారు.

పాముకాటుతో చిన్నారి మృతి


అమూల్య(ఫైల్)

ఇందల్వాయి: నాగుపాము కాటుతో నాలుగేళ్ల పసికందు మృతిచెందిన విషాద ఘటన మండలంలోని గన్నారంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివవరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి రజిత గంగాధర్ దంపతులకు ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు ఆడపిల్లలు కవలలుగా పుట్టగా అందులో అమూల్య పెద్దది. చిన్నారి ఇంటి ముందర ఆడుకుంటున్న సమయంలో నాగుపాము కాటు వేసింది. విషయయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది. కాగా ఆ పామును స్థానికులు చంపేశారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

తాడ్వాయి: తాడ్వాయికి చెందిన దూదేకుల జాకీర్ హుస్సేన్(44) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. జాకీర్ హుస్సేన్ బతుకు దెరువు కోసం దుబాయికి వెళ్లి వస్తుండేవాడు. ఇటీవల దుబాయి నుంచి తిరిగి వచ్చాడు. జాకీర్‌కు ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. కొన్ని నెలల క్రితం జాకీర్ కూతురు వేరే అబ్బాయిని ప్రేమ వివాహం చేసుకొని వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన జాకీర్ రోజు మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ పడుతుండేవాడు. బుధవారం రాత్రి బాగా మద్యం తాగి వచ్చి ఇంట్లో ఉన్న భార్య, కొడుకుతో గొడవ పడి వారిని కొట్టడంతో వారిద్దరు వేరే వాళ్ల ఇంట్లోకి వెళ్లి పడుకున్నారు. అనంతరం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రఫియా బేగం ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు


దీపిక


శివాని


శశిధర్


సాయిశివ

నిజామాబాద్‌నాగారం/కమ్మర్‌పల్లి: జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు జిల్లా నుంచి క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి టోర్నీ జరగనుంది. ఈనెల 26 నుంచి 30 వరకు హైదరాబాదులో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపిక కావటంతో వారినిఇ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, సలహాదారులు ఎన్వీ హనుమంత్ రెడ్డి, తదితరులు అభినందించారు.

ఎంపికైన క్రీడాకారులు..

ఉమ్మడి జిల్లా నుంచి శశిధర్(గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, కామారెడ్డి), సాయి శివ (గిరిరాజ్ కాలేజ్ నిజామాబాద్), శివాని(గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, మోర్తాడ్), దీపిక (గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, ఉప్లూర్) ఎంపికయ్యారు.

శోభాయాత్రలో అపశ్రుతి

- ట్రాక్టర్‌కు విద్యుత్ తీగ తగిలి ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న రాజు, శ్రీనివాస్

నందిపేట్: నందిపేటలో రామ్‌నగర్ కాలనీకి చెందిన శ్రీరామ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రాముడి శోభాయాత్రలో అపశ్రుతి నెలకొంది. ట్రాక్టర్‌కు రాముడి ప్రతిమతో కట్టిన ఫ్లెక్సీ ఫ్రేమ్‌కు ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ వైరు తగలడంతో ట్రాక్టర్‌కు విద్యుత్ సరఫరా అయింది. దీంతో ట్రాక్టర్‌లో కూర్చున్న పదిమంది పిల్లలతో పాటు యువకులకు విద్యుత్ సరఫరా జరిగి కరెంట్‌షాక్‌కు గురయ్యారు. ఈ విషయం గమనించిన ట్రాక్టర్‌లో ఉన్న యువకుడు పిల్లలను బయటకు విసిరేశాడు. ఈ ఘటనలో ట్రాక్టర్‌లో ఉన్న శ్రీనివాస్, పెయింటర్ రాజుతో పాటు పది సంవత్సరాల బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. ట్రాక్టర్ మూడు టైర్లు కాలిపోయాయి. ట్రాక్టర్‌పై ప్లాస్టిక్ టార్పాలిన్ పరచి ఉండడంతో పెను ప్రమాదం తప్పిందని విద్యుత్ శాఖ సిబ్బంది తెలిపారు. గాయపడిన బాధితులను స్థానిక ఆస్పత్రికి తరలించారు.